హ్యాంచుకోటం ఆమెలో ఆశ్చర్యాన్ని కలిగించింది, అయినా తనకు ధనలోపంలేదు. ప్రేమించే భర్త ఉన్నాడు. కూతురు ఉంది. లోకంతో తనకేంపని అన్నభావం ఆమెలో మెలగినా తనకు తెలియకుండానే తన హృదయం ఊహించని కలయికకై తహతహపట్టం ఆమెకు అగమ్యగోచరమయేది. తననుచూచి నిరసన భావంతో, వెటకారంతో, తోటి యువతుల విషపునవ్వులతో ఆమె హృదయంలో అగ్నిమంటలు చెలరేగేవి. అర్థంకానటువంటి ఆవేదన ఆమెను అలమటింప జేస్తూనేవుంది.

లీల పదహారేళ్ల పడుచయింది. లీల వయసులో తను అనుభవించిన ఆనందం స్మృతికిరాగానే కనకం శరీరం పులకితమయేది. కాని ఏ ఆనందదానికై ఆమె ఆ కాలంలో తహతహ పడేదో ఆ ఆనందఛాయలే ఆమె హృదయాన్ని కొన్ని సంవత్సరాల తరువాత కోసిపారేస్తున్నాయి. భర్త పోయాడు. ధనం తరిగిపోయింది. కూతురు వివాహానికై సిద్ధమయింది. లీలకు పెళ్ళిచేయాలి. కాని ఎవరితో? పెళ్ళికొడుకు ఎవరు? బంధువులు అన్నవారు ఏనాడో తనకులేనివారయారు. ఎవరి దగ్గరకువెళ్లి కూతురుకై వివాహప్రస్తావన తెస్తుంది. కనకంలో నిరుత్సాహం పూర్తిగా ఆవరించుకుంది.

వర్షం పడింది. వెలిసింది. ఆకాశంలో నక్షత్రాలు మిణుకుమిణుకుమంటున్నాయి. కూతుర్ని గట్టిగా కౌగలించుకుని వెక్కివెక్కి ఏడుస్తూంది కనకం. కలవరపాటుతో లీల లేచి తల్లిని అదిమిపట్టుకుంది. తల్లి కన్నీటిధారలు ఆమె మనసును ఆవేదనతో నింపివేసాయి. లీల కళ్లంట నీటిబిందువులు జలజల రాలాయి. "ఎందుకే నీకింత విచారం అమ్మా? నాకు తెలుసు నువ్వెందుకు దుఃఖిస్తున్నావో? కాని ఇట్లా మనసులో దిగులుతో ఎన్నాళ్లనికుళ్లిపోతావు? నాగురించేగా నీవిచారం? నా వివాహసమస్యకదూ నీవిచారానికి కారణం? కాని మనం చేసేదేముంది? కష్టపడి చదువుచెప్పించావు. సంబంధానికై పడరానిపాట్లు పడుతున్నావు. అయినా లాభంలేకపోయింది. దీనికి విచారం దేనికి? మనకష్టాలు గట్టెక్కాయి. నా కష్టానికి ఫలితంగా నాకు స్కూల్లో మాష్టరు పని అయింది. రేపట్నుంచే వెళ్లాలి" అంటున్న కూతురు పలుకులు ఆమె హృదయంలో ఆవరించుకున్న నల్లని మబ్బులను మాయంచేసాయి.

కథానిక

# ప్రయాణంతెచ్చిన రభస

## ఇంటూరి పుల్లారావు

ఇది నిజం అనటములో అతిశయోక్తి యెంతమాత్రంలేదు. ఈ నిజాన్ని మోసంతో కప్పిపుచ్చారు. ఆ పెద్దమనిషితరహా, వేషం ముందు నా నిజాయితీ జయంపొందలేకపోయింది. ఈ ప్రజ వేషాలకు మోసపోతుంది. నా నిజాన్ని నమ్మిన బుద్ధిమంతులు లేకపోలేదు! ఉన్నారు. లేకేం! ఈ నవనాగరిక ప్రపంచములో ఈళ్లాంటి వ్యక్తులు లేకపోతే నాబోటివాళ్లకు స్థానం యెక్కడ? నాడాలబూట్లతో నాకాళ్లు పచ్చడి పచ్చడిగా తొక్కి అదేమంటే తప్పంతా నాదేనంటు నాపై ప్రళయకాలరుద్రుని రూపం దాల్చుతాడా? నా ప్రక్కనకూర్చున్న ఛోటా మోటా మనిషి సర్దుబాటు చేయకపోతే యెంత రసభ జరిగివుండేదో? పెట్టెలోనుంచి దిగివెళ్ళేవరకు నావంక కోడెత్రాచు మాదిరిగా చూశాడు.

నా చూపు టీస్టాల్ మీదకు ప్రసరించింది. జేబులో చిల్లరడబ్బులు ఘల్లుమంటూ విసుగ్గా వాటి భాషలో యేమిటో గొణిగాయి. "ఈ స్థానంలో నుంచి మార్పు లేదా?" అంటున్నాయేమో.

"ఈ సంచీ సీటూ చూస్తుండండి" అన్నాను ఎదురుగా భీముడులా కూర్చున్న వయస్సు తిరిగిన ఒక వ్యక్తితో.

"సరే" అన్నట్లు అంగీకార సూచకంగా తల త్రిప్పాడు. టీస్టాల్ కేసి నడిచాను. రెండణాలు నాకు సెలవుచెప్పి అయ్యరు గళ్లాలోకి యెగిరి గంతేశాయి.

'రెండణాలకు గ్లాసు సగానికా టీ?' అన్నాను. రైలు పోతుందనే తొందరతో ప్రయాణీకులు

డబ్బిస్తూనే టీకోసం అయ్యర్ని వేడుకొంటున్నారు. ఈసందడిలో నాప్రశ్నకు జవాబెక్కడ?

టీగ్లాసు నోట కరచాను. నాలుక చుర్‌మంది. గొంతు భగ్గుమన్నది.

"చచ్చానురా...భగవంతుడా" అన్నాను అప్రయత్నంగా. కొంపదీసి నాలుక రసజ్ఞత కోల్పోలేదుగద? రైలుగంట ఘణఘణ మ్రోగింది. గార్డు విజిల్ వేశాడు. రైలు పొగలు గ్రక్కుతూ బయల్దేరింది. సగంటీ వదిలేసి బయల్దేరాను.

"టీ సగం గ్లాసే నన్నారు?" అన్నట్లు అయ్యరు నావంక చూశాడు. నేను పిల్లినైపోయాను. ఈపిల్లి మామూలుదికాదుసుమా? తెనాలి రామలింగం పెంపుడు పిల్లి. నేను కూర్చునివచ్చిన పెట్టె పదిగజాల దూరంలో వున్నది. పరుగుతీస్తున్నాను. అప్పుడు తెలిసింది నాకు చిన్నతనములో హైస్కూళ్లల్లో యేర్పాటుచేసే రన్నింగ్ రేస్ యొక్క వుపయోగము. నాకంటె ముందు పరుగుతీస్తున్న ఇద్దర్ని వెనకేశాను. ఎవరో నా పేరుతో పిలిచారు. ఆ పిలుపు లక్ష్యం చెయ్యక నా పెట్టెలో యెక్కాను. స్టేషనన్నా దాటక ముందే రైలు ఆగింది. ఇంతలో యెంత శ్రమ పడాల్సివచ్చింది. రైలుకూడా నామీద విరోధమేనా? మా రామం చిఱునవ్వుతో ప్రత్యక్షమయ్యాడు.

"అలసిపోయావట్టుందే!" అన్నాడు రామం.

"అలుపుకేంగాని కూర్చుందాం పద" అని నాసీటుకేసి చూశాను. అన్యాయం! మోసం! నా సంచి క్రిందపెట్టి నాసీట్లో కూర్చున్నది ఒక యువతి. "ఇది నాసీటు" అన్నాను. కాని ఈ మాటలు బయటకురావందే! గొంతుక సరిచేసి "ఇంతకుముందు నేనీసీట్లో కూర్చుని వెళ్లానండి" అన్నాను ఆన్యాపదేశంగా.

"సారీ...ఏదో కూర్చున్నాను" అన్నది నన్ను మరో సీటుకు ప్రయత్నించమన్నట్లు ముఖంపెట్టి.

నాసీటుపై బ్యాధతవహించమని చెప్పిన వ్యక్తితో "నావిషయం మరచారా?" అన్నాను.

"లేదునాయనా. చెప్పిచూశాను. లాభంలేకపోయింది" అన్నాడు.

రామం ఆ యువతిప్రక్కన కొద్ది స్థలము చూసి "ఆ బేగ్ తీస్తారా" అన్నాడు.

"కూర్చుంటారా?" అన్నది యువతి బెనారస్ సిల్కుచీర అప్యాయంగా సవరించుకొంటూ.

"ఆఁ...అవునండి" అన్నాడు రామం ఆశగా.

"మీరిక్కడ కూర్చొనుటకు నాకేమీ అభ్యంతరములేదు. కాని మావారు వస్తారు" అన్నది సందేహంగా.

"మంచిమాటన్నావు తల్లీ!" అని మారామంనుద్దేశించి "వయసుపిల్లపక్కన ఎట్లా కూర్చుంటానన్నావయ్యా? చదువుకున్నవారు కాబోలు" అన్నది చక్కగ ముస్తాబై బొమ్మలా కూర్చున్న ఒక పల్లెస్త్రీ.

ఆ యువతికి మామీద ఎందుకో ఆ దయ. "ఆ బెడ్డింగ్ నాదే. దానిమీద కూర్చోండి" అన్నది.

మారామం నేను గత్యంతరములేక ఆ బెడ్డింగ్ మీదనే కూర్చున్నాము. ఇంతలో గార్డ్ నాలుగు సంవత్సరాల పిల్లవాడిని తీసికొచ్చి "ఈ అబ్బాయికి సంబంధించినవారు యిక్కడ వున్నారా?" అన్నాడు.

ఎవరూ పలకలేదు. ఏడుస్తున్న పిల్లవాడిని ప్రక్క పెట్టెలోనికి తీసికొని వెళ్ళాడు. యువతి ముందు కూర్చున్న ఒక ముసలాయన చుట్ట ముట్టించాడు. ఫ్యాక్టరీ గొట్టంలో నుంచి వస్తున్నట్లుగ వున్నది ఆ పొగ. ఆ యువతి వుక్కిరిబిక్కిరైంది.

"ఆ పొగని కాస్త ఆపుచేయండి" అన్నది. ముసలాయన వినిపించుకోలేదు. మరోసారి మనవి చేసి చూసింది. ముసలాయన తిరిగి ఆ ఘాటైన పొగను ఆమెమీదకు ప్రయోగించే ప్రయత్నం చేశాడు. ఆమె సహించలేకపోయింది. చటుక్కున సీట్లోనుంచి లేచి ముసలాయన నోట్లో చుట్ట లాగి బయటకు విసరింది. ఆ చుట్ట ప్రక్కనే వున్న బుక్‌షాప్‌లోకి వెళ్ళి ఒక పుస్తకాన్ని చిందరవందర చేసింది ఆ చుట్ట. ఇం నయంకా నేను తప్పితే యింకెవరు చూడలేదు!—ముసలాయన కండ్లు పత్తికాయల్లా చేసి ఆమె వంక చూశాడు. జేబు తముడుకొని ఒక నిట్టూర్పు విడిచి తుపుక్కున వుమ్మేశాడు. వారిద్దరి మధ్య కొరియా యుద్ధంలాంటి దేదైనా జరుగుతుందేమో అనుకున్నాను. అంతపని జరగనందుకు ఈ శాంతిపక్షి ఆనందిస్తున్నది.

"ఏం విడ్డూరమేనా తల్లీ, మగాడినోట్లో చుట్ట లాగేశావు" అన్నది ఆ పల్లెస్త్రీ.

తిరిగి గార్డ్ విజిల్ వినిపించింది. రైలు ఒక్కసారిగ వెనక్కివచ్చి కదలింది. పెట్టెలోని వారందరూ ఒకరిమీద ఒకరు పడ్డారు. నా సీటు ఆక్రమించిన యువతి ప్రక్కనవున్న ఒక పరాయి యువకుడిమీదికి వాలింది. ఒకర్నొకరు తెల్లబోయి చూసుకున్నారు. పాపం ఆమె ముఖం తప్పించి పరాజయముతో పరుగిడుతున్న దృశ్యాలను చూస్తూ కూర్చుంది.

"మీనాన్న డబ్బివ్వనంటే యింట్లో నానా రసభా చేసి చెప్పకుండా పలాయనం చిత్తగించావటగా? మీనాన్న కాలుగాలిన పిల్లిలా తిరుగుతూ నా దగ్గిరకివచ్చి పదేపదే అడుగుతూ వుండేవాడు. నాకు తెలియదని చెప్తూ వుండేవాడిని భలే గాబరాగా వున్నాడు. తొందర మనిషి" అన్నాడు రామం.

"ఆఁ... వేడి వేడి బిస్కట్స్... తాజా... తాజా" అంటు పెట్టెలో ప్రవేశించాడు. పెద్దలు పద్దన కొద్దీ. నా ప్రక్కనే పెట్టెమీద కూర్చున్న ఒక పెద్దమనిషి నా ప్రక్క జేబులోకి చేతిని పెట్టున్నాడు.

"జేబుదొంగలు పెద్దమనుష్యులవలె వుండి తమపని సాగిస్తార"ని రామం నాతో ఒకసారి అనుభవపూర్వంగా చెప్పిన మాటలు గుర్తుకు వచ్చాయి.

అతడి చేతిని గట్టిగా పట్టేశాను.

"నా చేతిని పట్టుకుంటారేమండీ?" అన్నాడు.

"నా జేబులో చేతినెందుకు పెట్టారు?" అన్నాను.

"క్షమించండి - ఒత్తిడిగా వుంటంవలన నా జేబులో చెయ్యిపెట్టబోయి మీ జేబులో..." అన్నాడు. పెట్టెలో వారందరు గొల్లుమన్నారు. పాపం! అతని ముఖాన నెత్తురుచుక్కలేదు.

"మీ పేరేమిటండీ?" అన్నాడు మూలనుంచి ఒక వ్యక్తి, నా పేరు అతడికెందుకు? అతని ముఖమే నాకు తెలియదు.

"అట్లా చూస్తారేమండీ, పేరుచెప్పమంటే?" అన్నాడు అతని ప్రక్కనేవున్న మరొకడు. నా పేరుచెప్పాను. నా పేరు వినగానే వారిముఖాలు వికశించాయి. ఆశగా ఒకరిముఖం ఒకరు చూసుకున్నారే. వారి వాలకం నాకేమీ అర్థంకాలేదు. నవల చదవటము ఆపి వారికేసి చూస్తున్నాను.

"ఆ నవల యిటివ్వండి" అని మామీద దురాక్రమణ జరిపిన యువతి లాక్కుంది. మా రామం మాత్రం రాజకీయ చర్చల్లోంచి బయటపడలేదు- మూలనున్న ఇద్దరు వ్యక్తులు మాత్రం నన్ను తదేక దీక్షతో చూస్తూ తిరిగి పేపరు చూస్తున్నారు. మేము దిగివెళ్ళవలసిన స్టేషనువచ్చింది. సంచితో నేనూ రామం దిగాము. రామం వాళ్ల అక్కా బావా సంక్రాంతికి వచ్చే ట్రయిన్‌లో వస్తారని స్టేషనులోనే వున్నాడు. నేను స్టేషను దాటి వచ్చాను. ఎవరో భుజంతట్టారు. వెనక్కి తిరిగి చూశాను. రైల్లో నా పేరు అడిగినవారే! నాకు బాడీగార్డ్స్‌లా నిలబడ్డారు. ఒకడు నా చేతిలో సంచి తీసుకుని "నేను తెస్తాలే బ్రదర్" అన్నాడు.

"ఎవరు మీరు?" అన్నాను.

"మేము నిన్ను మీ నాన్నగారి దగ్గరకు తీసికెళ్తున్నాము" అన్నాడు మొదటివాడు విషపు నవ్వుతో.

"నేను వెళ్ళేదే అక్కడకు. మధ్యమీరేమిటి?"

"పాపం, ఏమీ తెలియదు, చూపరా పేపరు!" అన్నాడు రెండవ వాడితో. ప్రకటన కాలం చూపాడు.

నా ఫోటోవుంది! దానికింద నా పేరు, నన్ను పుట్టుమచ్చలతో సహా వర్ణిస్తూ ఒక పేరా, దాని క్రింద నన్ను పట్టి తెచ్చినవారికి నూట పదహార్లూ అందుకయిన ఖర్చులూ యిస్తానని మానాన్న ప్రకటించారు—డబ్బివ్వలేదని యింటి దగ్గర అలిగి చెప్పకుండా స్నేహితుడి పెండ్లికి వెళ్ళి పదిరోజులు తిప్పవేయటం ఎంత పనికి దోహదమిచ్చింది? చేతులు నలుపుకొంటూ వారి ముఖాలవంకకు చూశాను. చేతిలో నవలేదీ? ఆ యువతీ శిరోమణి తిరిగి యివ్వలేదన్నమాట. రైలు వెళ్లిపోయే వుంటుంది. నా సీటు అక్రమముగా ఆక్రమించటమేగాక నా నవలకూడా అపహరించింది, చదువు సంస్కారం వున్నవారుకూడ అప్పుడప్పుడు చోరత్వానికి పాల్పడతారు. కాళ్ళీడ్చుకొంటు ఇంటి త్రోవ తీశాను. నా బాడీగార్డ్స్ మటుకు నన్ను వదలలేదు.